# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 28-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశంలో వ్యవసాయ ఉత్పత్తి వేగంగా పెరగడానికి ప్రభుత్వ విధానాలు ఎంతగానో దోహదపడ్డాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ భారత యువత "దేశం ప్రథమం" అనే సూత్రానికి కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
- ❖ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ఈ ఉదయం బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో మరణించారు.
- ❖ దేశీయంగా విమానాలను తయారు చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- ❖ విశాఖ వేదికగా భారత్, న్యూజిలాండ్ జట్ల టీ-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో వ్యవసాయ ఉత్పత్తి వేగంగా పెరగడానికి ప్రభుత్వ విధానాలు ఎంతగానో దోహదపడ్డాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈరోజు ప్రారంభమైన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రాష్ట్రపతి.. ఉభయ సభల సంయుక్త సమావేశం ఉద్దేశించి మాట్లాడుతూ.. దేశంలో ఆహార, ఉద్యానవన పంటల ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరిందని పేర్కొన్నారు. వెనుకబడిన పంటల ఉత్పత్తిని పెంచడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, నూనె గింజలు, పప్పుధాన్యాలు మొదలైన వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులను తగ్గించడం కూడా ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. ఈ రంగాలలో దేశం స్వావలంబన దిశగా పయనిస్తోందన్నారు. 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం లక్ష్యాన్ని భారత్ ఈ దశాబ్దం చివరి నాటికి సాధిస్తుందని రాష్ట్రపతి విశ్వాసం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం.. వికసిత్ భారత్ జి రామ్ జి అనే చట్టాన్ని రూపొందించామని, ఇది గ్రామాల్లో 125 రోజుల ఉపాధి హామీని కల్పిస్తుందని ద్రౌపది ముర్ము పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

గడచిన దశాబ్ద కాలంలో భారత్ ప్రతి రంగంలోను బలోపేతం అవుతూ వచ్చిందని, ఈ సంవత్సరం వికసిత్ భారత్ వైపు ప్రయాణానికి ఒక ప్రధాన పునాది అని రాష్ట్రపతి అన్నారు. గత 11 సంవత్సరాలలో, ఈశాన్య ప్రాంతంలో 7 వేల 200 కిలోమీటర్లకు పైగా జాతీయ రహదారులు నిర్మించబడ్డాయని, దీని ద్వారా మారుమూల, గిరిజన, సరిహద్దు ప్రాంతాలకు చేరుకోవడం సులభతరం అయిందని రాష్ట్రపతి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్‌సీసీ అనేది భారతదేశ యువతను ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, జాతికి అంకితభావంతో కూడిన సున్నితమైన పౌరులుగా మార్చే ఉద్యమం అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. న్యూఢిల్లీలోని కరియప్ప పరేడ్ గ్రౌండ్‌లో ఈరోజు జరిగిన వార్షిక ఎన్‌సిసి పిఎం ర్యాలీని ఉద్దేశించి ప్రధానమంత్రి మాట్లాడుతూ... నేటి యువత దేశం ప్రథమం అనే సూత్రానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. భారతీయ యువత నైపుణ్యం, సంస్కృతి కారణంగా ప్రపంచం నేడు దేశ యువతను ఆత్మవిశ్వాసంతో చూస్తోందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా NCC బలం 14 లక్షల నుండి 20 లక్షలకు పైగా పెరిగిందని, సరిహద్దు, తీర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో చేరుతున్నారని చెప్పారు. ఈ సంవత్సరం బాలిక క్యాడెట్ల భాగస్వామ్యం గణనీయంగా పెరగడం పట్ల ప్రధానమంత్రి సంతోషం వ్యక్తం చేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ఈ ఉదయం మహారాష్ట్రలోని బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. లియర్ జెట్ 45 (VT-SSK) విమానం ఈరోజు తెల్లవారుజామున బారామతి విమానాశ్రయంలో కూలిపోయిందని, ఈ ఘటనలో ఉప ముఖ్యమంత్రితో పాటు మరో నలుగురు సిబ్బంది కూడా మృతి చెందారని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తెలియజేసింది. అజిత్ పవార్ మూడు దశాబ్దాలుగా వివిధ మంత్రి పదవులను నిర్వహించారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా సహకార రంగం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, ఆయన లేని లోటు పూడ్చలేనిదని రాష్ట్రపతి సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. కష్టపడి పనిచేసే నాయకుడిగా పవార్ పేరు గడించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సందేశంలో అన్నారు. అట్టడుగు వర్గాల ప్రజలతో సంబంధాలు కలిగిన గొప్ప నేత అని కొనియాడారు. కాగా.. అజిత్ పవార్ మృతి పట్ల లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తీవ్ర సంతాపం తెలియజేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

తయారీ రంగం అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోందని పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. వింగ్స్ ఇండియా - 2026 ను హైదరాబాద్‌లో ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణల ద్వారా సామాన్య ప్రజలు సైతం విమాన ప్రయాణాలు చేయగలుగుతున్నారని పేర్కొన్నారు. దేశంలో సుమారు 350 విమానాశ్రయాలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్న ఆయన.. దేశీయ తయారీని సులభతరం చేయడానికి విమానయాన ఎకో సిస్టంమ్‌ను పెంచే దిశగా కృషి చేస్తున్నామన్నారు. ఎకో సిస్టమ్ దేశీయంగా విమానాలను తయారు చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తోందని రామ్మోహన్ నాయుడు తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా దాదాపు 12 వేల ఆయుష్ ఆరోగ్య, వెల్‌నెస్ కేంద్రాలు ప్రజలకు సమగ్ర ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. కేరళలోని ఆర్య వైద్యశాల ఛారిటబుల్ ఆసుపత్రి శతాబ్ది ఉత్సవాలను ఉద్దేశించి ఆయన వర్చువల్ గా ఈరోజు ప్రసంగించారు. ఆరోగ్య సంరక్షణలో ఆయుర్వేదం పాత్ర కీలకమైనదని పేర్కొన్నారు. ఈ వైద్య ఆసుపత్రి ప్రారంభమైనప్పటి నుండి అవిశ్రాంతంగా ప్రజలకు సేవలందిస్తోందని చెప్పారు. ఆయుర్వేదంలో దీర్ఘకాలిక చికిత్సా విధానం తరతరాలుగా ప్రజలకు వైద్య సేవలను అందిస్తూ.. ఎంతో ఉపయోగకరంగా ఉంటోందన్నారు. భారత్ - యూరోపియన్ మధ్య నిన్న కుదిరిన వాణిజ్య ఒప్పందంలో భారతీయ సాంప్రదాయ వైద్య సేవలకు, అభ్యాసకులకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు. ఈ ఒప్పందం EUలో ఆయుష్ వెల్నెస్ కేంద్రాలను స్థాపించడంలో సహాయపడుతుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ ప్రజలకు సుపరిపాలనను సకాలంలో అందించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2015లో Pro-Active Governance and Timely Implementation (ప్రగతి) పేరిట నిర్మాణాత్మకయిన సమీక్షా కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత దశాబ్ద కాలంగా ప్రగతి.. కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో జాప్యానికి కారణమయ్యే సమస్యలపై దృష్టి సారించడంతో సత్వరం పరిష్కారాలు లభించి, అనేక ప్రాజెక్టులు వేగవంతమయ్యాయి. అందులో భాగంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ప్రాజెక్టుల గురించి ఈరోజు  తెలుసుకుందాం. ప్రగతి ఆధ్వర్యంలోని PMG పోర్టల్‌లో ప్రస్తుతం ఛత్తీస్ గఢ్ కు చెందిన 99 ప్రాజెక్టులు, 6 లక్షల 11 వేల 040 కోట్ల రూపాయల సమీకృత పెట్టుబడితో పర్యవేక్షణలో ఉన్నాయి. వీటిలో 27 ప్రాజెక్టులు ప్రగతి కింద ప్రధానమంత్రి చేత సమీక్షించబడ్డాయి. ఈ 27 ప్రగతి ప్రాజెక్టులలో లక్షా 07 వేల 546 కోట్ల రూపాయల పెట్టుబడితో 14 ప్రాజెక్టులు ఇప్పటికే ప్రారంభించబడ్డాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = =

స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ (SIR) జరుగుతున్న సమయంలో ఇందులో పాల్గొన్న ఏ అధికారినీ ముందస్తు అనుమతి లేకుండా బదిలీ చేయరాదని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్ నుండి ముందస్తు అనుమతి లేకుండానే ముగ్గురు పరిశీలకులకు బదిలీ ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొంది. ఈ చర్యను వ్యతిరేకిస్తూ... ఆ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని కమిషన్.. రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య నాల్గగో టీ -20 క్రికెట్ మ్యాచ్ విశాఖపట్నంలోని ఏసీఏ -వీడీసీఏ క్రికెట్ స్టేడియం వేదికగా జరుగుతోంది. తొలుత టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన న్యూజిలాండ్ 19 ఓవర్లకు 7 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. భారత బౌలర్లలో కులదీప్ యాదవ్, అర్షదీప్ సింగ్ 2 వికెట్లు తీయగా.. జస్ప్రీత్ బుమ్రా, రవి బిష్ణోయ్ ఒక్కో వికెట్ తీశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం  81 వేల 857 పాయింట్ల వద్ద లాభాలతో ప్రారంభమై... చివరికి 487 పాయింట్ల లాభంతో 82 వేల 344 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 167 పాయింట్లు లాభపడి 25 వేల 342 వద్ద ముగిసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =